శోభాయమానం.. కుంభాభిషేకం

- ఉరుకుందకు తరలివచ్చిన వేలాది మంది భక్తులు
- హెలిక్యాప్టర్‌తో పూలవర్షం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



బంగారు నాగాభరణ నృసింహస్వామి విగ్రహాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి



ప్రధాన ద్వారం వద్ద కలశాలతో తరలివచ్చిన మహిళలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి మహా కుంభాభిషేక మహోత్సవం శోభయమానంగా కొనసాగింది. ఉత్సవాన్ని తిలకంచడానికి ఉరుకుంద గ్రామంతో పాటు మజరా గ్రామాలైన ఓబుళపురం, తిమ్మపురం మూడు గ్రామాల నుంచి వెయ్యి మందికి పైగా ముత్తైదువులు కలశాలతో పాదయాత్రగా తరలివచ్చారు. ఆయా రాజగోపురాల వద్ద కలశాలతో మహిళలు వేడుకలు ముగిసేదాక మంగళకార్యంలో పాత్రులయ్యారు. బెంగళూరుకు చెందిన భక్తుడు మంజునాథ్ హెలికాప్టర్‌తో పుష్పాలు వేయించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఉరుకుంద క్షేత్రం భక్తజనంతో పరవశించిపోయింది. కార్యక్రమంలో దేవాలయంలో గతంలో పనిచేసిన ఈఓలు, సిబ్బంది సైతం తరలివచ్చి స్వామి సన్నిధిలో గడిపారు. అన్ని పార్టీల నాయకులు కుంభాభిషేకంలో పాల్గొని స్వామివారికి పూజలు చేపట్టారు.

కళాకారుల నీరాజనాలు

వేడుకలో భాగంగా వేలాది మంది కళాకారులు ప్రదర్శనలు చేపట్టారు. ప్రత్యేక వేదికపై ఆదోని నృత్య కళాకారులు నాట్య ప్రదర్శన, ఉరకుంద వాసుల చెక్కభజన కోలాటాలు, మహిళల కర్ర కోలాటాలు, వీరభద్ర వేషధారుల ప్రదర్శనలు విశేషంగా అలరించాయి.

వేడుకలో ప్రముఖులు

వేడుకల్లో ఈరన్న స్వామి కుంభాభిషేకానికి పుష్పగిరి శంకరాచార్య మూల సంస్థానం పీఠాధిపతి విద్యాన్నసింహ భారతీస్వామి, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, హాల్వి సిద్ధేశ్వరస్వామి మఠం పీఠాధిపతి మహంతేశ స్వామి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, ఆలయ ఈఓ విజయరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, డీఈ సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.






వినాయకుడి విగ్రహ ప్రతిష్టాపనలో శంకరాచార్య మూల సంస్థాన పీఠాధిపతి విద్యాన్నసింహ భారతిస్వామి,కలశాలతో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి,వేంకటేశ్వరస్వామి వేషధారణలో నాట్య ప్రదర్శన, కోలాటాల ప్రదర్శనలో మహిళలు

క్లుప్తంగా

మారికాంబదేవి విగ్రహ ఊరేగింపు



కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కౌతాళం: మండల కేంద్రంలోని కామవరం రస్తాలో వెలసిన మారికాంబదేవి నూతన విగ్రహ ఊరేగింపును మంగళవారం సాయంత్రం గ్రామ విధుల గుండా వైభవంగా నిర్వహించారు. దేవాలయాన్ని భక్తుల విరాళాలతో నూతనంగా నిర్మించారు. ఆలయంలో మంగళవారం మారికాంబదేవి విగ్రహ ప్రతిష్ట చేపట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

ఐరన్‌బండలో రేపు విగ్రహ ప్రతిష్ట

గోనెగండ్ల : మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని గ్రామపెద్దలు సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామంలో వెలసిన సుంకులాపరమేశ్వరి దేవి, మారెమ్మ ఆలయ ఉభయ ధ్వజస్తంభములు, లింగమయ్య స్వామి, గ్రామ బొడ్రాయి, వాల్మీకి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఉంటాయన్నారు. పూజ కార్యక్రమాలను 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తాదులందరూ విరివిగా పాల్గొని అమ్మవార్ల అనుగ్రహము పొందాలన్నారు.

రైతులను విస్మరించిన కేంద్రం

నందవరం : కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులను విస్మరించారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి దిక్కేలేదన్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలు దిగుబడులు, గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, ఆ సంఘం నాయకులు నాగేష్, చెన్నప్ప, తిమ్మప్ప, తాయన్న తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించండి

ఆదోని సెంట్రల్ /ఆదోనిరూరల్: సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అఖండ కోరారు. వసతి గృహాల్లో అవినీతికి పాల్పడుతున్న వార్డన్లపై తక్షణమే చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ హాస్టల్ వార్డన్స్ కారణం లేకుండా సెలవు పెట్టడం, చాల వసతి గృహాలకు రెగ్యులర్ వార్డన్లు లేకపోవడంతో ఇన్‌చార్జ్ వార్డన్లను నియమించడంతో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కూరగాయలు తరగడం, నీళ్లు తెచ్చుకోవడం వంటి పనులను విద్యార్థులతో చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అనిల్, మహేష్, హరి, గర్జప్ప తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: ఆదోని పట్టణంలో ఈనెల 15వ తేదీన జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 48వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల కరపత్రాలను ఆ సంఘ నాయకులతో కలిసి స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్, పార్క్ రోడ్డు, సోగనూరు రోడ్డు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని సిబ్బందిని సూచించారు.

వంట ఏజెన్సీపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిబంధనల మేరకు మెనూ పాటించకుండా నాణ్యత లేని సరుకులతో వంట వండుతున్న వంట ఏజెన్సీపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ విష్ణు, దస్తగిరిలు డిమాండ్ చేశారు. సోమవారం వారు పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తిని వెంటబెట్టుకొని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమకు అనుకూలమైన వారికి వంట ఏజెన్సీలు అప్పజెబుతుండటంతో వారు మెనూ ప్రకారం వండటం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీను, రాఘవేంద్రనాయుడు, అంజి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పీజీఆర్ఎస్



సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్


ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాస రావు, వేణుసూర్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు మొద్దునిద్ర వీడాలి

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో పని చేస్తున్న తహసీల్దారు శ్రీనాథ్‌తో పాటు ఆర్ఐ, సిబ్బంది మొద్దునిద్ర వీడాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ డిమాండ్ చేశాడు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో సమస్యలను విన్నవించేందుకు పలు గ్రామాల నుంచి రైతులు, ప్రజలు వచ్చారు. సమయం 10.30గంటలు కావస్తున్నా తహసీల్దారు శ్రీనాథ్‌తో పాటు సిబ్బంది రాకపోవడంతో వారు ఎదురు చూడాల్సి వచ్చింది. దీంతో కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సమయం 10.30గంటలు కావస్తున్నా ఒక్క సిబ్బంది కూడా కార్యాలయంలో కనిపించకపోవడం దారుణమన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసాలతో, పనులను వదులుకొని సమస్యల పరిష్కారం కోసం వచ్చి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. అధికారులు సమయపాలన పాటించి రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు వీరేష్, బజ్జప్ప, నర్సోజి, యంకన్న, మొట్రు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వేతనాన్ని రికవరీ చేయాలి

ఆదోని రూరల్: తప్పుడు ధ్రువీకరణ పత్రం సమర్పించి ఉద్యోగం పొందిన ఉపాధ్యాయుడి నుంచి వేతనాన్ని రికవరీ చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్‌రాజు కోరారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆదోనిలోని మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు గతేడాది తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించి ఉద్యోగం పొందాడన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి సదరు టీచర్‌ను తొలగించారన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు మహేష్, భాస్కర్, బడేసావలి, విక్రమ్, కిరణ్ పాల్గొన్నారు.




ముగతిలో నూతనంగా నిర్మించిన ఆలయం, నూతనంగా ప్రతిష్టించిన జంబులాపరమేశ్వరి దేవి మూలవిరాట్

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

నందవరం : మండలంలోని ముగతి గ్రామంలో సోమవారం నూతన ఆలయంలో జంబులా పరమేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రతిష్టాపనలో భాగంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. నటరాజ శాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రకంగా వేదపఠనంతో ప్రతిష్ట మహోత్సవం జరిపించారు. గోపూజ, గణపతి పూజ, కలశ స్థాపన గావించి, దుర్గ, గణపతి, సరస్వతి, లక్ష్మి హోమాలు చేపట్టారు. యంత్ర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతితో ప్రతిష్ట మహోత్సవం ముగిసింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతిష్టాపన ఉత్సవంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, నాయకులు, గ్రామ పెద్దలు, భక్త బృందం పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని రైతు సేవ కేంద్రంలో డీసీఎంఎస్, ఏపీ మార్కుఫెడ్ కందుల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ అధికారిణి హేమలత, సర్పంచ్ హైమవతి సోమవారం ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ కందులకు కనీస మద్దతు ధర రూ.7,550 ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేస్తామని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో కంది పంట సాగుచేసి ఈ పంటలో నమోదు చేసుకున్న రైతుల కందులను మాత్రమే కొనుగోలు చేస్తారని చెప్పారు. కందులు అమ్మదలచిన రైతులు తమ గ్రామాలలో ఉన్న రైతు సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, మహేంద్ర, షఫీ, రాజ్యలక్ష్మి, చైతన్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

7న 'చలో హైదరాబాద్'

గోనెగండ్ల: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ నేతృత్వంలో ఈ నెల 7న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో లక్షల డప్పులు.. వేల గొంతులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే దుష్టశక్తులను మాదిగ డప్పుల మోతలతో ఉక్కిరి బిక్కిరి చేస్తామన్నారు.కార్యక్రమంలో ఎర్రన్న,నాగేష్,సీమోను, మాదన్న, సుంకన్న, మోహన్ పాల్గొన్నారు.

కోసిగి: ఎస్సీ వర్గీకరణ సాధనకై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఈనెల 7న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని కోసిగి ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గప్ప మాదిగ, రామన్న, వీరరాఘవులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఛలో హైదరబాద్ పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి హనుమంతు, అధికార ప్రతినిధి నరసింహులు, ఈరన్న, ఎంఈఎఫ్ నాయకులు ప్రభాకర్, ఉరుకుందప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను మూసివేయడం తగదు

ఎమ్మిగనూరుటౌన్: పాఠశాలల పునఃవ్యవస్థీకరణ పేరుతో ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం మూసివేయడం తగదని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు దావీదు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎల్లప్ప అన్నారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జీఓ నెంబర్ 117ను రద్దు చేస్తూ ఇచ్చిన మెమోలో 60మందికి పైబడిన విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మారుస్తామని చెప్పి, ఇప్పుడు పంచాయతీకి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. 30కి పైబడిన విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని కోరారు. సమావేశంలో నాయకులు నాగరాజు, దేవపాల్, నరసింహులు, వీరభద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తూ కరోనా, అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, ఆయా కార్మికుల కుటుంబ సభ్యులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఏపీ మహిళా సమాఖ్య పోరాటం చేస్తుందని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు ఈరమ్మలు అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ మేరకు మహిళలతో కలిసి తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భాస్కర్ యాదవ్, సమీవుల్లా, కేసీ జబ్బార్, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఆకలి కేకలు



భోజనం కోసం భక్తుల అగచాట్లు

మంత్రాలయం: ప్రముఖ ఉరుకుంద ఈరన్న స్వామి మహా కుంభాభిషేక మహోత్సవంలో భక్తులకు అల్పాహార, అన్న ప్రసాదం పంపిణీలో తీవ్ర ఇక్కట్లు ఎదురయ్యాయి. వేలాది రూపాయలు వెచ్చించి మచిలీపట్నం నుంచి వంట ఏజెన్సీని తెప్పించినా భక్తుల ఆకలి తీర్చడంలో విఫలమయ్యారు. ఉదయం టిఫిన్ సైతం అరకొరగా సరఫరా చేశారు. మధ్యాహ్నం భోజన విషయాల్లోనూ ఇదే సమస్య దాపురించింది. గంటల తరబడి భక్తులు నిరీక్షించిన భోజనాలు దొరకలేదు. అంతేగాక మడుగు నీటిలోనే భోజనాలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు చిన్నారులు ఆకలితో అలమటించగా తల్లులు వెనుదిగారు. రూ.కోట్లు ఖర్చు చేసినా భోజనాల విషయంలో ఆలయ అధికారుల అలసత్వం కొట్టిచ్చినట్లు కనబడింది. ఈ విషయంపై వేలాది మంది భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

శంకరమఠంలో వసంత పంచమి




పూజలందుకున్న అమ్మవారు . పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని తిరుమలనగర్‌లో శ్రీ శారదా పీఠంలో వసంత పంచమి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. శ్రీ శారదాపీఠంలో అమ్మవారికి వసంత పంచమి సందర్భంగా విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, సహస్ర నామ కుంకుమార్చన, అక్షరాభ్యాస కార్యక్రమం, మేధా సూక్త సరస్వతి, సూక్త హోమాలు నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త డాక్టర్ కృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు దత్తాత్రేయశర్మ సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరుమలనగర్‌వాసులు ఆర్థిక సేవ సహాయ సహకారాలు అందించారు. వాసవీ మహిళా మండలి వారు దాదాపు 50 మంది లలితా సహస్రనామ పారాయణం, సౌందర్య లహరి పారాయణం చేశారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం



మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సన్మానిస్తున్న జల్లా కార్యదర్శి జాలవాడి లక్ష్మన్న

ఎమ్మిగనూరురూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేసిన కోటేకల్ నాయకుడు జాలవాడి లక్ష్మన్న సోమవారం మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. పార్టీ అప్పగించిన జిల్లా కార్యదర్శి పదవీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, అందరిని కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. మండల ఉపాధ్యక్షుడు గుడేకల్ పాలయ్య, సర్పంచ్ లు వెంకట్రామిరెడ్డి, రంగస్వామి, బోడబండ మల్లేష్, పెసలదిన్నె అర్జున్, మల్కాపురం పెద్దయ్య, హనుమంతు, మేకల మల్లయ్య ఉన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న గడ్డం నారాయణరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం రైతులు సాగు చేసిన మిరప పంటకు తెగుళ్లు, పురుగులు ఆశించి దిగుబడులు తగ్గిపోయాయన్నారు. అదేవిధంగా గతేడాదితో పోల్చితే మార్కెట్‌లో ధరలు 50శాతం నుంచి 80శాతం పడిపోయాయని తెలిపారు. సూపర్ టెన్ రకం మిరప గత ఏడాది క్వింటా రూ.22వేల ధర పలుకగా ఈ ఏడాది కేవలం రూ.8వేలకు అమ్ముడుపోయిందని చెప్పారు. బ్యాడిగ రకం మిరప పంట గతేడాది క్వింటా రూ.52వేల నుంచి రూ.60వేల వరకు వుండగా ఈ ఏడాది రూ.14వేలకు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి వుండగా తెగుళ్ల కారణంగా 15 క్వింటాళ్లకు తక్కువగానే వచ్చాయన్నారు. గుంటూరు మార్కెట్‌లో ధరలు అమాంతం పడిపోవడంతో దిగుబడులు విక్రయించేందుకు వెళ్లే రైతులకు కనీసం లారీల బాడుగ సైతం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా తీవ్రంగా నష్టపోయిన మిర్చి రైతుకు ఎకరాకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల మేర నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

టెంకాయపై ఈరన్నస్వామివారి రాజగోపురం



చిత్రకారుడు మల్లికార్జున



ఆదోని రూరల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన చిత్రకారుడు మల్లికార్జున ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్నస్వామి వారి ఆలయంలో నూతనంగా నిర్మించిన రాజగోపురాన్ని టెంకాయపై చిత్రీకరించి అబ్బురపరిచాడు. ఉరుకుంద ఈరన్నస్వామి వారి మహా కుంభాభిషేకం, రాజగోపురాల ఆవిష్కరణ సందర్భంగా టెంకాయపై పెయింటింగ్ సాయంతో తూర్పు రాజగోపురాన్ని మూడు గంటలపాటు శ్రమించి వేసినట్లు ఆయన తెలిపారు.

కుటీర పరిశ్రమలతో యువతకు ఉపాధి



కుటీర పరిశ్రమలపై అవగాహన కల్పిస్తున్న స్పందన ఎన్‌జీఓ సంస్థ సలహాదారు శారద

ఎమ్మిగనూరుటౌన్: డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు కుటీర పరిశ్రమలపై తగిన అవగాహన కలిగి వుంటే తమ గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబుబ్‌బాషా, స్పందన ఎన్‌జీఓ సంస్థ సలహాదారు శారద సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ శాఖ ఆధ్వర్యంలో స్పందన ఎన్‌జీఓ సంస్థ నిర్వాకులు కుటీర పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ తమ గ్రామాల్లోనే కుటీర పరిశ్రమలు పెట్టుకొని తాము ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి చూపించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ, నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ పాల్ దేవదానం, కెరీర్ గైడెన్స్ శాఖ ఇన్‌చార్జ్ రాజశేఖర్, లక్ష్మన్న, ఈరన్న సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.